# గుజరాత్‌లో అన్నికేసులూ బెస్ట్ బేకరీ కేసులే కాబోతాయా?

ముద్దాయిలు బాధితులనూ సాక్షులనూ బెదిరించి శిక్ష నుండి తప్పించుకోవడం కొత్త విషయం కాదు. బెస్ట్ బేకరీ కేసుకు ముందు ఎన్నడూ జరగనిదీ కాదు.

మరయితే బెస్ట్ బేకరీ కేసు గురించి ఇంత ఆందోళన ఎందుకు?

అది మామూలు హత్య అయి వుంటే ఇంత ఆందోళన జరిగేది కాదు. క్రిమినల్ కేసులలో ఇది ఎప్పుడూ ఉండేదేలే అని మరచిపోతారు. కానీ అది మామూలు హత్య కాదు. అధికార బలం, అధికార యంత్రాంగం అండ ఉన్న దుండగులు నిస్సహాయులయిన ఒక ప్రజావర్గంపైన కొన్ని వారాలపాటు జరిపిన మారణకాండలో భాగంగా జరిగిన అనేక మూకుమ్మడి హత్యలలో ఒకటి బెస్ట్ బేకరీ హత్యాకాండ. అదే అధికార బలం, అదే అధికార యంత్రాంగం అండ ఇప్పుడు సాక్షులను హంతకులే వాళ్ళ ఇంటి నుండి కోర్టుకు తీసుకొచ్చి అబద్ధం చెప్పించి మళ్ళీ ఇంటికి సాగనంపే వికారమైన ప్రహసనాన్ని రచించింది. అందుకే ఇంత ఆందోళన.

మొన్న కోర్టులో 'ఏం జరగలేదు' అని చెప్పిన షేక్ జాహిదా హబీబుల్లా సరిగ్గా ఒక సంవత్సరం క్రితం పత్రికల వాళ్ళకూ జాతీయ మానవహక్కుల కమీషన్‌కూ సిటిజన్స్ ట్రిబ్యునల్‌కూ ఏం చెప్పిందో ఒకసారి జ్ఞాపకం చేసుకోవడం ఉచితంగా వుంటుంది. బెస్ట్ బేకరీ బరోడాలోని హనుమాన్ టేక్రీలో ఉంది (ఉండింది అనడం ఉచితంగా వుంటుంది). హనుమాన్ టేక్రీలో అప్పటికి ముస్లిం కుటుంబాలు కొన్నే ఉండేవి. వారిలో ఒకరు బెస్ట్ బేకరీ యజమానులు. అంతకుముందు నుండి అక్కడ ఉంటున్న ముస్లిం కుటుంబాలు గోద్రా మారణకాండ జరిగిన రోజు ఆ ప్రాంతాన్ని వదలిపెట్టి వెళ్ళిపోగా బెస్ట్ బేకరీ కుటుంబం మాత్రం ఉండిపోయింది. దానికి కారణం జయంతి బతీజా

---

ప్రజాపంథా వారపత్రిక, 15.7.2003

'చాయ్‌వాలా' అనే స్థానిక పెద్దమనిషి 'మీకేంకాద'ని వాళ్ళకిచ్చిన హామీ. అతనిని నమ్మి అక్కడే ఉండిపోయిన ఆ కుటుంబాన్ని అతనే పక్కన ఉండి మూకుమ్మడిగా చంపించాడు.

మార్చి 1వ తేదీ రాత్రి 8 గంటలప్పుడు ఆ పెద్దమనిషి, అతనితోపాటు 500-700 మంది స్థానికులు బెస్ట్ బేకరీపైన త్రిశూలాలతో, పెట్రోల్ బాంబులతో దాడి చేశారు. బేకరీ బయట ఉన్న మూడు లారీల కలపను తగలబెట్టారు. పెట్రోలు బాంబులు వేసి అందరినీ చంపుతామని ఆస్తి దోచుకుంటామని కేకలు వేశారు. షేక్ కుటుంబం, వారి పనివారు (అందులో ముగ్గురు హిందువులు) మొత్తం 30 మంది దాకా ఆ బిల్డింగ్‌లో చిక్కుకున్నారు. సహాయం కోసం వారు పానీగేట్ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్‌చేయగా ఇదిగో వస్తున్నాం అన్నారు పోలీసులు. ఒక గంట తరువాత ఒక జీపు వచ్చి బిల్డింగ్ చుట్టూ మూగి అల్లరి చేస్తున్న జనం దగ్గర ఒక నిమిషం ఆగి వెళ్లిపోయింది.

ఆ తరువాత హత్యాకాండ మొదలయింది. బిల్డింగ్ మొదటి అంతస్తులోని స్టోర్ రూంను, పనివారి గదిని లూటీచేసి ఎనిమిది మందిని సజీవంగా దహనం చేశారు. మేడ మీద గూమిగూడిన వారిమీదికి గుంపుగా వచ్చారు. జాహిదా తల్లి చేతులు జోడించి ప్రాధేయపడింది. ఆమెను పక్కకు తోసేసి ఆమె కొడుకులిద్దరినీ ఆమె కళ్ళముందే సజీవంగా దహనం చేసి చంపారు. బేకరీ పనివారయిన ముగ్గురు హిందువుల కడుపులు కోసి మంటలలో విసిరి చంపారు. మొత్తం 14 మందిని నరికి కాల్చి హతమార్చారు.

హంతకులు స్థానికులే. వారి నాయకులు బాధితులకు పరిచితులే. హనుమాన్ టేక్రీ అధికంగా దిగువ, మధ్యతరగతి హిందువులు నివసించే ప్రాంతం. గుంపంతా అక్కడి నుండే వచ్చారు. వారి నాయకులు జయంతీ బతీజా చాయ్‌వాలా, అతని కొడుకులు, వాహేష్ సున్నా పెయింటర్, సంజయ్ ఠక్కర్, సంతోష్ ఠక్కర్, జగ్దీష్ రద్దీవాలా, దినేష్ బేకరీవాలాలు.

తమ ఉదాసీన వైఖరి ద్వారా మారణకాండకు ప్రత్యక్షంగా సహకరించిన పోలీసులు ఆ తరువాత జరిగిన ఆందోళన కారణంగా కేసు నమోదు చేశారు. కానీ విచారణ ఘడియ దగ్గరపడేసరికి 'నోరు మూసుకుంటారా? ఇంకొక దఫా

చావు చూడదలచుకున్నారా?' అని స్థానిక హిందూత్వవాదులు ఆ కుటుంబంలో మిగిలివున్న వారిని బెదిరించి లోబరుచుకున్నారు. జయంతి బతీజాయే తమను కాపాడాడనీ, అతనే సమయానికి రాకుంటే అందరూ చచ్చిపోదుమనీ షేక్ జాహిదా స్వయంగా కోర్టులో సాక్ష్యం చెప్పింది. స్థానిక బిజెపి ఎం.ఎల్.ఏ. ఆమెను ఇంటినుండి కోర్టుకు, మళ్ళీ కోర్టు నుండి ఇంటికి సాగనంపాడు.

గుజరాత్ మారణకాండలో ఇది తీర్పుకొచ్చిన మొదటి కేసు. దీనికంటే కూడా ఘోరమయిన ఘటనలు అహ్మదాబాద్ నగరంలోనూ, ఇతర జిల్లాల గ్రామీణ ప్రాంతాలలోనూ జరిగాయి. వాటిలో విశ్వహిందూ పరిషత్ నాయకుల ప్రత్యక్ష భాగస్వామ్యమూ ఉండింది. మరి వాటి గతి ఇంతకంటే భిన్నంగా ఉండబోతుందా? మూకుమ్మడిగా ముస్లింలను తన వారిచేత చంపించిన నరేంద్రమోడి ప్రభుత్వం బాధితులనూ, సాక్షులనూ హంతకులు బెదిరించి లోబరచుకోకుండా అడ్డుకుంటుందా?

చోద్యంచూస్తూ నవ్వుకుంటుంది. బెస్ట్ బేకరీ కేసులో అదే జరిగింది. గుజరాత్ మారణకాండను అందరూ మరచిపోయారు లెమ్మని భావించి జరగవలసింది గోప్యంగా జరిపించేశారు. అంతా సజావుగా జరిగిపోయిందని అనుకుంటున్న తరుణంలో పత్రికలు బెస్ట్ బేకరీ తీర్పుకు బాగా ప్రాచుర్యం ఇచ్చాయి. దేశమంతా నిరసన వ్యక్తమయింది.

ఆ కేసును అన్యాయం నుండి రక్షించడం ఇప్పుడంత సులభంకాదు. గుజరాత్ హైకోర్టు తలచుకుంటే 'రీట్రయల్' (పునర్విచారణ) ఆదేశించగలదు. అయితే ఒకసారి అబద్ధం చెప్పిన సాక్షులను (ఎంత సకారణంగానయినా సరే) రెండవ విచారణలో నమ్మవచ్చునా అనేది ఒక పెద్ద న్యాయశాస్త్ర సమస్య కాబోతుంది.

అదెలాగున్నా ఇంకా జరగనున్న కేసులలోనయినా బెస్ట్ బేకరీ ప్రహసనం పునరావృతం కాకుండా చూసుకోవడం అవసరం. ఈ పని ఎవరు చేయాలి? న్యాయంగా అయితే గుజరాత్ ప్రభుత్వం చేయాలి, కానీ వారు చేయరు. వారు చేయకపోతే కేంద్ర ప్రభుత్వం ఆదేశించి చేయించవచ్చు. కానీ వారూ చేయరు. అందులో వారిద్దరూ కూడా భాగస్వాములు కాబట్టి ఆ చొరవ వారు తీసుకోరు.

ప్రజా సంఘాలు, ఉద్యమాలు ఈ పని చేపట్టవలసి ఉంటుందని చెప్పడం సులభమే. కానీ గుజరాత్‌లో అటువంటివి ఉండి ఉంటే నిరుటి మారణకాండకు కొంతయినా ప్రతిఘటన ఉండేది. ఏ రకమైన ప్రజాతంత్ర ఉద్యమాలూ గుజరాత్‌లో లేకపోవడం నిరుడు బయటపడిన చేదు సత్యం.

అయితే ఇప్పుడు పరిస్థితి కొంచెం మెరుగుపడిన దాఖలాలు కనిపిస్తున్నాయి. కిందటి సంవత్సరం అచేతనంగా ఉండిపోయిన గుజరాతీ అభ్యుదయశక్తులు ఇప్పుడు కొంచెం కదులుతున్నారు. పెద్ద ప్రజాఉద్యమాలు నిర్మించడం ఇప్పట్లో జరగకపోయినా నిరసన ఉద్యమాలూ బాధితులకు అండగా నిలబడే కార్యక్రమాలూ సాధ్యమయ్యే దాఖలాలు కనిపిస్తున్నాయి. చిన్న చిన్న ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పియుసిఎల్ వంటి హక్కుల సంఘాలు మరొక బెస్ట్ బేకరీ జరగకుండా ఆడ్డుకోవడానికి ముందుకొస్తున్నాయి. వారికి బయటి నుండి చేయగల సహాయం స్వల్పమే అయినప్పటికీ, కనీసం నిరుడు జరిగిన మారణకాండ మరుగున పడిపోకుండా ఉంచగలిగితే ఆ మేరకు వారి కృషికి తోడ్పడిన వారమవుతాము.